తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 55 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ బుధవారం 25-09-2023 వెల: 5/రూ -




## విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

### కస్తూర్బా విద్యాలయాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు

**నారాయణ పేట బ్యూరో.సెప్టెంబరు 24.(డైలీ రిపోర్ట్):** విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనుకోని అతిథిగా వచ్చి తమతో పాటు కింద కూర్చుని జిల్లా కలెక్టర్ భోజనం చేయడంతో ఆ విద్యార్థినుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

2లో





## అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలి
- ప్రైవేటు కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి
- కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు
- ఖమ్మం నగరంలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మం, సెప్టెంబర్ -24 ( డైలీ రిపోర్ట్): ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఖైకొండాయగూడెంలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులు 195.00 లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెం లో 200.00 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు.

2లో

# 'మూసీ' నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు!



- చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నివసిస్తున్న అర్హులైన పేదలకూ కేటాయింపు
- మూసీ రివర్‌ఫ్రంట్‌పై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- జల వనరుల పరిరక్షణ చర్యల్లో పేదలు రోడ్డున పడొద్దు
- వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపాలి
- ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురవకుండా గట్టి పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలని ఆదేశం
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోరైల్ విస్తరణ

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంతోపాటు హైదరాబాద్‌లోని చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నివసిస్తున్న అర్హులైన పేదలెవరూ నిరాశ్రయులు కావడానికి వీల్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. జల వనరుల పరిరక్షణలో పేదలు రోడ్డున పడవద్దని, అర్హులైన వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు.

## కర్ణాటక సీఎంకు షాక్

- ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర హైకోర్టు ఓకే
- గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ కొట్టివేత
- సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్
- నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం
- హైకోర్టు తీర్పుపై సుప్రీంలో సవాల్?
- నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ



## శ్రీలంక ప్రధానిగా హరిణి



కొలంబో: శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా హరిణి అమరసూర్య(54) ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు ముగియడంతో సోమవారం ప్రధాని దినేశ్ గుణవర్ధనే పదవికి రాజీనామా చేశారు. నూతన అధ్యక్షుడు అనూర కుమార దిస్స నాయకే మంగళవారం జరిగిన ఒక కార్య క్రమంలో హరిణితో ప్రధానిగా ప్రమాణం చేయించారు. ఎన్‌పీపీకే చెందిన విజితా హెరత్, లక్ష్మణ్ నిపుణ రచ్చిలతోపాటు అధ్యక్షుడు దిస్సనాయకే కూడా మంత్రిగా ప్రమాణం చేయడం గమనార్హం. నవంబర్ 14పార్లమెంట్ ఎన్నికలు జరిగేదాకా తాత్కాలిక కేబినెట్ పనిచేస్తుంది. పార్లమెంటును రద్దు చేస్తూ నూతన అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే మంగళవారం రాత్రి నిర్ణయం ఉత్తర్వులు జారీ చేశారు.బండారునాయకే

2లో

## తెలంగాణకు రెండురోజులు వర్ష సూచన


హైదరాబాద్: మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం బలపడింది.సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది.దీని ప్రభావంతో మంగళ,బుధ వారాల్లో





## రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా

- చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదం
- రాజ్యసభలో 8కి పడిపోయిన వైసీపీ బలం
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా కృష్ణయ్య



## ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- చౌటుప్పల్ జంక్షన్ రింగు విస్తీర్ణాన్ని పెంచొద్దు
- గతంలో కోమటిరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు

హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపు ల్ ఆర్) భూ సేకరణలో నష్టపోతున్న రైతులు, బాధితులకు న్యాయం చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ట్రిపుల్ ఆర్‌తో నష్టపోతున్న రైతులు మంగళవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ భరోసా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాక్షాత్తూ భువనగిరి సభలో ప్రియాంకాగాంధీ హామీ ఇచ్చారు.

# కర్ణాటక సీఎంకు షాక్

(మొదటి పేజీ తరువాయి)

బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్దరామయ్య వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సిద్దరామయ్య భార్య పార్వతి అక్రమమార్గంలో ముడా నుంచి 14 ఇంటి స్థలాలు పొందారని, ఆమె నుంచి ముడా సేకరించిన భూమి కంటే వీటి విలువ ఎన్నో రెట్లు అధికమని సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్.. సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నెలరోజులపాటు విచారించి మంగళవారం తీర్పు ఇచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడం సమంజసమైనదని తీర్పులో స్పష్టం చేసింది. సీఎం కుటుంబసభ్యులు లబ్ధి పొందిన విషయం కావడంతో విచారణ జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో కర్ణాటక రాజకీయాలలో కలకలం ఏర్పడింది. బెంగళూరు నగర పర్యటనలో ఉన్న సిద్దరామయ్య హుటాహుటిన అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ఎంబీ పాటిల్, శివరాజ్ తంగడిగ, కృష్ణబైరేగౌడ, బైరతి సురేశ్ తదితరులు కూడా హుటాహుటి కావేరికి చేరుకున్నారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కావేరికి చేరుకుంటున్నారు. ఓ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ కూడా బెంగళూరుకు బయల్దేరినట్లు సమాచారం. హైకోర్టు తీర్పు మేరకు సీఎం ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని సూర్జేవాలా భరోసా ఇచ్చారు. న్యాయపోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. తద్వారా రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అధిష్ఠానం పరోక్షంగా సందేశమిచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించడంతో ఆయన హైకోర్టు ఉన్నత ధర్మాసనం లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఏకసభ్య ధర్మాసనం తీర్పు అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి, మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఫోన్‌లో చర్చించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సాధ్యమైనంత త్వరగా పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. సిద్దరామయ్య తరఫున బుధవారం పిటిషన్ వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం అధికారిక నివాసం 'కావేరి' వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాజీనామా కోరుతూ మైసూరులో బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు.


**తప్పు చేయలేదు: సిద్దూ**

ముడా ఇంటి స్థలాల విషయంలో తాను ఎటువంటి తప్పూ చేయలేదని సిద్దరామయ్య చెప్పారు. న్యాయవ్యవస్థపైనా, రాజ్యాంగంపైనా తనకు నమ్మకం ఉందని, న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. అంతిమ విజయం సత్యానిదేనన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురాలోచనతో కుట్ర పన్నారని, గవర్నర్ రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీవి ప్రతీకార రాజకీయాలని ఆరోపించారు. తాజా రాజకీయ పరిస్థితులపై బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

## ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగంలో జంక్షన్‌ను 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని రైతులు నష్టపోతున్నారు. గతంలో జంక్షన్ రింగును 78 ఎకరాల్లో ప్రతిపాదించగా, ప్రస్తుతం 184 ఎకరా లకు పెంచడంతో నష్టం పెరుగుతుంది. గతంలో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రె డ్డి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నా చేశారు. కానీ ఇప్పు డు పోలీసు బలగాలతో నిర్బంధంగా సర్వే చేసి ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేయాలని ఒత్తిడి చేయడం దుర్మార్గం. కాంగ్రెస్ మాట నిలుపుకునేంత వరకు బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. బాధితుల పక్షాన పోరాటం చేస్తాం'అని హరీశ్‌రావు చెప్పారు.

## తెలంగాణకు రెండురోజులు వర్ష సూచన



తెలంగాణలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే చాన్సుందని వాతావరణ కేంద్రం తెలిపింది.గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. కొమరంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ ,రంగారెడ్డి,వికారాబాద్,సంగారెడ్డి,మెదక్, కామారెడ్డి,మహబూబ్ నగర్,నాగర్కర్నూల్,వనపర్తి,నారాయణపేట,జోగులాంబ గద్వాలకు భారీ వర్షసూచన ఉంది.దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

## శ్రీలంక ప్రధానిగా హరిణి

తర్వాత: సిరిమావో బండారు నాయకే (2000) తర్వాత శ్రీలంక ప్రధాని అయిన తొలి మహిళగా హరిణి నిలిచారు. ఆమె హక్కుల కార్యకర్త. యూనివర్సిటీ లెక్చరర్‌గా చేస్తున్నారు.

**డిగ్రీ చదివింది ఢిల్లీలోనే..**

శ్రీలంక నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణి అమరసూర్య డిగ్రీ చదివింది ఢిల్లీ యూనివర్సిటీ లోనే. ఇక్కడి హిందూ కాలేజీలో 1991%-% 1994 సంవత్సరాల్లో సోషియాలజీలో బీఏ పూర్తి చేశారు. హిందూ కాలేజీ పూర్వ విద్యార్థిని శ్రీలంక ప్రధాని కావడం తమకెంతో గర్వకారణమని కాలేజీ ప్రిన్సిపాల్ అంజు శ్రీవాస్తవ హర్షం వ్యక్తం చేశారు. హరిణి బ్యాచ్‌మేట్, బాలీవుడ్ డైరెక్టర్ నళినీ రంజన్ సింగ్ కూడా సంతోషం వ్యక్తం చేశారు.

# 'మూసీ' నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

నీటి వనరుల పరిరక్షణకు వారు సహకరించేలా ఒప్పించడంతోపాటు అర్హులైన పేదలకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు అర్హులైన పేదల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలని.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో రైలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. నగరంలోని అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలన్నారు.

**ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు తేల్చండి**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు అన్నింటినీ గుర్తించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని.. ఆక్రమణల వివరాలన్నీ సేకరించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని సూచించారు. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలు ఉండాలని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ఏర్పాటు చేయాలని, దీనిపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పాతబస్తీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. దసరాలోపు మెట్రో విస్తరణపై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్లలో నివాసమున్న వారికి పునరావాసం కల్పించేందుకు వీటిని ఉపయోగిస్తారు. మూసీ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో.. పునరావాస ప్రక్రియను బుధవారం ప్రారంభించనున్నారు. 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. బుధవారం నుంచి రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు.. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎక్కడెక్కడ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించారో వివరించనున్నారు. తొలుత రివర్ బెడ్‌లోని 1,600 ఇళ్లను తొలగిస్తారు. వారిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తారు. ఇక మూసీ బఫర్‌జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే సదరు నిర్మాణ ఖర్చుతోపాటు పట్టా ఉన్న భూమి విలువను పరిహారంగా చెల్లిస్తారు. డబుల్ బెడ్రూమ్ ఇంటిని కూడా కేటాయిస్తారు.

# అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో కోటి 30 లక్షలకు డ్రైయిన్, కొన్ని రోడ్ల పనులు చేపట్టామని, అవి నేడు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి అన్నారు. స్మశాన వాటిక నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేసుకున్నామని, టెండర్ పూర్తి చేశామని, త్వరలో ఆ పనులు పూర్తవుతాయని, వాటితో పాటు కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.నేడు శంకుస్థాపన చేసుకున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో 2 నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని మంత్రి ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వం తీసుకొని అర్హులైన పేదలకు పంచడం జరుగుతుందని అన్నారు. దేవాదాయ, రెవెన్యూ భూములకు సంబంధించి ఎవరు పోజిషన్ లో ఉన్నా యుద్ధప్రాతిపదికన రిటర్న్ తీసుకోవాలని మంత్రి రెవెన్యూ డివిజన్ అధికారి ఆదేశించారు. అనంతరం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జలగం నగర్, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలని, కరుణగిరి ప్రాంతాలలో మంత్రి మోటార్ సైకిల్ పై వీధి వీధి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటామని, వరదల వల్ల నష్టపోయిన ప్రతిఒక్కరికి పరిహారం అందజేస్తామని, ఆస్తి, పశు నష్టం జరిగిన వాటికి పరిహారాన్ని



అందజేస్తామని అన్నారు. అధికారులు ముంపు ప్రాంతాల్లోనే సహాయక కేంద్రం, మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి, సర్టిఫికెట్లు కోల్పోయిన వారికీ అందజేస్తామన్నారు. ముంపు వల్ల అపరిశుభ్రమైన ప్రదేశాలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అధికారులు మరోమారు సందర్శించి, నష్టపోయిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, మునిసిపల్ డిఇ ధరణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)



న్యూఢిల్లీ: బీసీ సంఘం నాయకుడు, ఏపీలోని వైసీపీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశారు. సోమవారమే రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేయగా.. మంగళవారం ఆయన ఆమోదం తెలిపారు. పదవీ కాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే కృష్ణయ్య రాజీనామా చేశారు. వైసీపీ నుంచి ఇటీవల రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్ రావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. దీంతో, వైసీపీ రాజ్యసభ సభ్యుల సంఖ్య 11 నుంచి ఎనిమిదికి తగ్గింది. హైదరాబాద్: ఆర్.కృష్ణయ్య తదుపరి అడుగు చర్చనీయాంశమైంది. ఆయన్ను మోదీ ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా కొత్త పార్టీ ఏర్పాటు చేయాలని రెండ్రోజుల కిందట జరిగిన సమావేశంలో పలు బీసీ సంఘాలు ఆయన్ను కోరాయి. అంతకుముందే బీజేపీ జాతీయ అగ్ర నేతలు ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం జరిగింది. ఆయనకు కీలక పదవి కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో బీసీ ఓటుబ్యాంకు మరింత పెంచుకోవచ్చన్న అంచనాల్లో భాగంగా వారు ఆయనతో చర్చించినట్లు చెబుతున్నారు. కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, ౹ర అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఆయన్ను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తారనడానికి సంకేతాలని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

## ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

న్యూయార్క్: ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై, సాధారణ ప్రజల మరణాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ సాధ్యమైనంత త్వరగా యుద్ధం ముగిసిపోవాలని, శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై మూడు గంటలకుపైగా చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో సంక్షోభానికి త్వరగా తెరపడేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చక్కటి పరిష్కార మార్గం కోసం అంకితభావంతో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఉక్రెయిన్ విజ్ఞప్తితోనే మోదీ%-%జెలెన్‌స్కీ మధ్య ఈ సమావేశం జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. జెలెన్‌స్కీతో భేటీ అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.



## విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ కి వెళ్లిన సమయంలో అక్కడ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సిద్ధం కావడంతో మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించెందుకు ఆ విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారితో ముచ్చటిస్తూ భోజనం చేశారు. భోజనం బాగుందని, రోజూ ఇలాగే మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎస్ ఓ కు సూచించారు. అంతకుముందు కలెక్టర్ ఆ విద్యాలయంలో పలు తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువు ఎలా సాగుతోందని విద్యార్థులను అడిగారు. విద్యాలయంలో జరుగుతున్న పదో తరగతి, ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థుల మినీ గ్రాండ్ టెస్ట్ ను ఆమె పర్యవేక్షించారు. పై అంతస్తులోని డార్మెంటరీ గదిని పరిశీలించారు. కాగా విద్యాలయంలో డ్రైనేజీ సమస్య ఉందని, బోరు మరమ్మతు చేయించాలని, వంటగది పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో షెడ్డును నిర్మిస్తే విద్యార్థినిలు అల్పాహారం, భోజనం చేసేందుకు అనువుగా ఉంటుందని ఆ విద్యాలయ ఎస్ఓ కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ డైనింగ్ హాల్ లేదా అని ప్రశ్నించగా, విద్యాలయంలో పాఠశాల తో పాటు, కళాశాల కూడా కొనసాగుతుండడంతో గదుల కొరత ఉందని, డైనింగ్ హాల్ ను కూడా తరగతి గదులకు వినియోగిస్తున్నట్లు ఎస్ ఓ కలెక్టర్ కు తెలిపారు. అయితే విద్యాలయంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న పనులను అందుబాటులో ఉన్న నిధులతో చేయించాలని, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి తనకు పంపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జయరామ్, ఎంపీడీవో సాయి లక్ష్మి, ఎంపీ ఓ ఉదయ్ శంకర్, కస్తూర్బా విద్యాలయ ఎస్ ఓ పాల్గొన్నారు.

# రోడ్డు గుంతలను పూడ్చి ఇబ్బందులు తొలగించిన గంగారం ఎస్సై రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు





మహబూబాబాద్ జిల్లా:గంగారం మండలంలో ప్రధాన రోడ్డు గుంతల మయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారగా పోలీసు వారి సహకారంతో శ్రమదానం చేసి మంగళవారం లోతైన గుంతలను పూడ్చి ఇబ్బందులు తొలగించారు. దాదాపు రోడ్డు మీద ఉన్న మొత్తం లోతైన గుంతలు, వర్షానికి నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. పరిస్థితులను గమనించిన గంగారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, గంగారం ఎస్సై రవికుమార్ సహకారంతో జెసిపి మరియు ట్రాక్టర్లతో మొరం పోయించి స్వయంగా శ్రమదానం చేసి గుంతలు పూడ్చి చదును చేశారు. మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్ల తన ఉదార స్వభావంతో స్పందించి తను సొంత డబ్బులతో అప్పటికప్పుడు మొరం తెప్పించి వర్షాలకు, నీటి నిలువలకు ఎలాంటి తావు లేకుండా, రోడ్డు బాగుండేలా గుంతలు పూడ్చి మొరం పోసి లేవలింగ్ చేయించారు. మండల అధ్యక్షుడై ప్రజల బాగోగులను కోరుకునే వ్యక్తిగా మరియు పోలీసుల శ్రమ దానం-వారి సేవా భావం చూసి మండల వాసులు, వాహన దారులు, బాటసారులు జాడి వెంకటేశ్వర్లు, పోలీసులను ఎంతగానో మెచ్చుకున్నారు. శబ్బాష్ పోలీస్ అంటూ కొనియాడారు.ఈ కార్యక్రమంలో గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు, గంగారం ఎస్సై రవి కుమార్,పోలీస్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# రెడ్డి వర్సెస్ రెడ్డి.!

## టీపీసీసీ, ఏఐసీసీ పెద్దల ద్వారా ప్రయత్నాలు

**ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464**



అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: టీపీసీసీ చీఫ్ గా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశమున్న నేపథ్యంలో పార్టీని సన్నద్ధం చేసేందుకు జిల్లా వారీగా రివ్యూ మీటింగులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీలను నియమించవచ్చే చర్చ జరుగుతున్నది. దీంతో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నేతలు ఆ పీఠాన్ని దక్కించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో చాలా మంది నేతలు ఉన్నా.. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మధ్యే తీవ్ర పోటీ ఉన్నట్లు తెలుస్తున్నది. టీపీసీసీ, ఏఐసీసీ పెద్దల ద్వారా వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే కేడర్ నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకుండా.. పార్టీకి చెడ్డ పేరు రాకుండా అవినీతి ఆరోపణలు లేని వ్యక్తిని డీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నది.

**సాజిద్ ఖాన్ సస్పెన్షన్ నుంచి ఖాళీగానే..**

గత అసెంబ్లీ ఎన్నికల నుంచే ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్ష పదవి ఖాళీగానే ఉన్నది. కాంగ్రెస్ విపక్షంలో ఉన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని మాజీ మంత్రి సీఆర్ఆర్, సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత, భార్గవ్ దేశ్ పాండే, సంజీవ్ రెడ్డి వంటి వారు ముందుండి నడిపించారు. అయితే బీజేపీ నుంచి ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగానే పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్ రెడ్డి ఒకవైపు, అప్పుడు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత, సంజీవ్ రెడ్డి మరోవైపు నిలిచారు. 'ట్రిపుల్ ఎస్'కు భార్గవ్ దేశ్ పాండే సైతం మద్దతు తెలిపారు. అయితే ఆదిలాబాద్ నియోజకవర్గ టికెట్టు కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేయగా, అధిష్టానం కంది శ్రీనివాస్ రెడ్డిపై భరోసా ఉంచింది. ఆదిలాబాద్ నుంచి ఆయన్ను బరిలో నిలిపింది. ఫలితంగా ట్రిపుల్ ఎస్ తరపున సంజీవ్ రెడ్డి రెబల్ గా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో అధిష్టానం సాజిద్ ఖాన్, సంజీవ్ రెడ్డి, గంద్రత్ సుజాత, భార్గవ్ దేశ్ పాండేపై ఆరేళ్లపాటు సస్పెన్షన్ విధించింది. అప్పటి నుంచి డీసీసీ పోస్టు ఖాళీగానే ఉన్నది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాజిద్ ఖాన్, సుజాత, సంజీవ రెడ్డి, భార్గవ్ దేశ్ పాండేలపై పార్టీ ఒకసారి సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి పార్టీలోకి తీసుకున్నట్లు టీపీసీసీ నాయకులు ప్రకటించారు. అయితే ఆ తర్వాత కంది శ్రీనివాస్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ సస్పెన్షన్ యథావిధిగానే కొనసాగుతుందని టీపీసీసీ నుంచి మళ్లీ ప్రకటనలు జారీ అయ్యాయి. అయితే వీరికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కేడర్ ఉండడంతో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీకి ఎంతో మేలు జరుగుతుందని భావించి సాజిద్ ఖాన్, సుజాత, సంజీవ రెడ్డితోపాటు భార్గవ్ దేశ్ పాండే పై సస్పెన్షన్ ఎత్తివేసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు చర్చ జరుగుతున్నది.

**స్థానిక ఎన్నికల నేపథ్యంలో..**

ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. గ్రామాల్లో పాగా వేసి ఉన్నది. స్థానిక ప్రజాప్రతినిధుల్లో ఆపార్టీ వారే ఎక్కువ. మరో వైపు ఆదిలాబాద్ లో బీజేపీ గెలవడంతో ఆ పార్టీ ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్నది. బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఒక్క ఖానాపూర్ సెగ్మెంట్లో మాత్రమే కాంగ్రెస్ పాగా వేయగలిగింది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా అంతటా పర్యటించి అందరిని కలుపుకొని పోయే నాయకుడికి డీసీసీ పోస్టు ఇవ్వాలని అధిష్టానం భావిస్తున్నది. అందుకోసం అధిష్టానం పార్టీని సమర్థవంతంగా నడిపే, కాంగ్రెస్ కార్యకర్తలతో మమేకమై, పార్టీకి చెడ్డపేరు రాకుండా ముందుకు తీసుకెళ్లగల నాయకుడిని డీసీసీ పీఠంపై కూర్చోబెట్టేందుకు తీవ్ర కసరత్తులు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది.

**ఇద్దరి మధ్యే తీవ్ర పోటీ..**

డీసీసీ అధ్యక్ష పదవి కోసం అనేక మంది నాయకులు ప్రయత్నాలు చేస్తున్నా.. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మధ్యే తీవ్ర పోటీ ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే సీనియర్లను కాదని.. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భరోసా సంపాదించి.. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్టు సాధించుకోగలిగిన కంది శ్రీనివాస్ రెడ్డి.. మూడో స్థానంతో పెట్టుకున్నారు. ఆ తర్వాత అధిష్టానం ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత ప్రభుత్వంలో ఏదైనా నామినేటెడ్ పోస్టు కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు చర్చ జరిగింది. అయితే ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు ఎలాంటి పదవి ఇవ్వొద్దని కాంగ్రెస్ సూత్రప్రాయ నిర్ణయం తీసుకోవడంతో ఆయనకు అవకాశం లభించలేదు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కోసం చెప్పుకోదగ్గ ఓట్లను రాబట్టడంలో కంది శ్రీనివాస్ రెడ్డి విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు డీసీసీ పోస్టు కోసం తనకు తెలిసిన నాయకుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే హెచ్1బీ వీసా స్కామ్ లో ఆయన పేరు బయటకు రావడంతో అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వివిధ రకాల ఆరోపణలు ఉన్న వ్యక్తికి డీసీసీ పగ్గాలు అప్పగిస్తే పార్టీ ఇమేజ్ పై నెగెటివ్ ఎఫెక్ట్ పడుతుందని భావిస్తున్నట్లు సమాచారం.

**శ్రీకాంత్ రెడ్డికి అవకాశాలు..**

రైతు కుటుంబం నుంచి వచ్చిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి 2006 నుంచి కాంగ్రెస్ లో పని చేస్తున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. మేజర్ పంచాయతీ అయిన మావల ఇన్ చార్జి గా పని చేశారు. 2019 నుంచి 2021 వరకు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. పార్టీ తరపున కార్యక్రమాలు చేస్తూ ఉండడం ఆయనకు ప్లస్ పాయింట్. అంతేకాకుండా పార్టీ ఓటు బ్యాంకు జారిపోకుండా కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. కంది శ్రీనివాస్ రెడ్డి కంటే సీనియర్ కావడం, పార్టీ పట్ల డెడికేషన్ ఉండడం ఆయనకు కలిసొచ్చే అవకాశముంది. ఇప్పటికే తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆయన ఏఐసీసీ నాయకురాలు దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అయితే టీపీసీసీ చీఫ్ గా ఎంపికైన మహేశ్ కుమార్ గౌడ్ ఎవరిపై భరోసా ఉంచుతారో వేచి చూడాలి. కాగా, డీసీసీ అధ్యక్ష పీఠంపై ఎవరు కూర్చుంటారోనని కాంగ్రెస్ కార్యకర్తలు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# డ్రగ్స్ ,సైబర్ నేరాలు, షీ టీమ్స్ పై అవగాహన కల్పించిన పోలీసులు

## డ్రగ్స్ మత్తులో యువత చిత్తు

## చెడు వ్యసనాలతో చెడిపోవద్దు

## గంజాయిని నిషేధించడమే ప్రధాన లక్ష్యం




**కోదాడ బ్యూరో,సెప్టెంబర్ 24 (డైలీ రిపోర్ట్)::** డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, షీ టీమ్స్ , గుట్కాలు నిషేధించడమే ప్రధాన లక్ష్యమని కోదాడ పట్టణ సీఐ రాము అన్నారు. జిల్లా ఎస్పి కోదాడ డిఎస్పి ఆదేశాల మేరకు కోదాడ పట్టణంలోని కిడ్స్ కళాశాలలో మత్తుమందులపై పోలీస్ కళాబృందంతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సిఐ రామ మాట్లాడుతూ... షీ టీమ్స్ ,సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్,మత్తు మందులు,గుట్కాలపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో స్కూల్లో, కళాశాలలో, వసతి గృహాల్లో, చదువుకునే విద్యార్థులు యువతీ, యువకులు ఇంటర్నెట్ సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల వల్ల మోసాలు గురి కావద్దని, బ్యాంకు ఖాతా ఏటీఎం వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దని, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావద్దని తెలిపారు. సైబర్ మసాలా పై 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం షీ టీమ్స్ మహిళా ఎస్సై నీలిమ మాట్లాడుతూ.. మహిళ రక్షణ పై పటిష్టంగా పనిచేస్తున్నామని ఆకతాయిల ఆటలు సాగవని, మహిళలను, ఆడపిల్లలను గౌరవించాలని తెలియజేశారు. ఎవరైనా మీ ఆత్మ గౌరవాన్ని భంగపరిచినట్లయితే షి టీమ్స్ నెంబర్ 8712686056 సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిడ్స్ కళాశాల చైర్మన్ నీలం సత్యనారాయణ, డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ గాంధీ, షీ టీం ఏఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ గోవిందు, ఎల్లారెడ్డి, యాకూబ్ ,మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి, హేమలత, మౌనిక, శృతి, ఎల్లయ్య, గోపయ్య, గురు, కృష్ణ, చారి, నాగార్జున, కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# గూడూరులో గంజాయి పట్టివేత

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి: అక్రమ సంపాదనే ధ్యేయంగా యువత చెడు దారి పడుతుందని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు అన్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం సాయంత్రం గూడూరు మండలం మచ్చర్ల గ్రామ స్టేజి వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు.దానిలో భాగంగా 2 కార్లలో అక్రమంగా తరలిస్తున్న 1 క్వింటా 87 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు గూడూరు డీఎస్పీ తిరుపతి రావు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో ఒరిస్సా రాష్ట్రం నుంచి భద్రాచలం మహబూబాబాద్ గూడూరు మీదుగా హైదరాబాద్ కి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారుగా రూ.46 లక్షల 76 వేల రూపాయల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు.ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మండల నరేష్ చత్తీస్ ఘడ్ కు చెందిన రాహుల్ మజుందార్, హరీష్ యాదవ్ బాపన్ లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి వలన యువత పాడైపోతున్నారని దానివల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంలో ప్రజలు సహకరించాలని గంజాయి,డ్రగ్స్ గురించి ఎలాంటి సమాచారం అందిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు గంజాయి వినియోగం చేసిన రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న గూడూరు సిఐ బాబురావు ఎస్సై గిరిధర్ రెడ్డి, సిబ్బంది బిచ్చ నాయక్, కుమారస్వామి, రాజేష్, ప్రణీత్ అమ్ములను డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు.

# రాష్ట్ర కుష్ఠు నివారణ బృందం పర్యటన



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం వైద్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటుగా ప్రజలు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్రము నుంచి వచ్చిన బృందం సభ్యులు సూచించారు. మంగళవారం రోజు ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల ప్రభుత్వ ఆసుపత్రి లో ఆశాలకు, ఏ ఎన్ ఎం లకు ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.ఈ కుష్ఠు వ్యాదిని ప్రాథమిక దశలో గుర్తించి ఎం డి టీ మందుల ద్వారా చికిత్స అందించి వ్యాధి పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు.అంగ వైకల్యం రాకుండా నివారణ చేయవచ్చని సూచించారు.అనంతరం ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంల రికార్డులను పరిశీలన చేసి తగు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర బృందం సభ్యులు,జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు,డి పి ఎం ఓ లు సకల రెడ్డి, వెంకటేశ్వర చారి,ఎం. శ్రీనివాస్, డి ఎస్ ఓ సురేందర్ లు ఆదిలాబాద్ జిల్లా వైద్య అధికారి డాక్టర్ గజానం, డీపీఓస్ మధుసూదన్, వామన్ రావ్ లు, బజార్ హత్నూర్ డాక్టర్ కే. భీం రావ్,ఎన్ /పి. రవీంద్ర, సూర్య ప్రకాష్,జి. రమేష్, వైద్య శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

## తెలంగాణ రాష్ట్ర స్థాయి డీలర్ల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్




**పటాన్చెరు అర్బన్, సెప్టెంబర్ 24 (డైలీ రిపోర్ట్):** రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్చెరు శాసనసభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్. ప్రధానంగా ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా ప్రతి రేషన్ డీలర్ కు 5 వేల రూపాయల గౌరవ వేతనం, క్వింటాలుకు 300 రూపాయల కమిషన్ అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి బోసు జి, రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సుమారు 10 వేల మంది రేషన్ డీలర్లు హాజరయ్యారు.



## గాజులగూడ, లక్ష్మారెడ్డిగూడ, ఆలంఖాన్ గూడ

# గ్రామాలలో బిజెపి సభ్యత్వం

**రాబోయే ఎన్నికలలో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: మండల పార్టీ అధ్యక్షుడు బసగళ్ల రాములు గౌడ్**



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 24: (డైలీ రిపోర్ట్):** రాబోయే ఎన్నికలలో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని శంకర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు బసగళ్ల రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గాజులగూడ, లక్ష్మారెడ్డిగూడ, ఆలంఖాన్ గూడ గ్రామాలలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బిజెపి సభ్యత్వం కార్యక్రమాన్ని రాములు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ దేశంలో బిజెపిని అతి పెద్ద పార్టీగా చేయడమే సభ్యత్వ నమోదు ఉద్దేశ్యమన్నారు. దేశాన్ని వికసిత్ భారత్ గా మార్చడంలో ప్రతి కార్యకర్త ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పరమేశ్వర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల నరసింహ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బండమీది వెంకటేష్, మాజీ సర్పంచ్ భోజి రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ బీరప్ప గొర్రెల మేకల పెంపకదారుల సంఘం ఫెడరేషన్ అధ్యక్షులుగా పెర్ని రవి



**రఘునాథపల్లి, సెప్టెంబర్ 24 (డైలీ రిపోర్ట్):** ఈరోజు రఘునాథపల్లి మండల కేంద్రంలో కురుమ సంఘం భవనంలో శ్రీ బీరప్ప గొర్రెల మేకల పెంపక దారుల సంఘం ఫెడరేషన్ ఎలక్షన్ లో భాగంగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా పేర్ని రవి కురుమ , ఉపాధ్యక్షుడిగా బడితే శ్రీనివాస్ , కార్యదర్శిగా మరాటి జంపయ్య , డైరెక్టర్స్ గా పేర్ని వెంకటేష్ , పేర్ని నాగరాజ్ , పేర్ని అనిల్ , దేవర రాజు , పేర్ని ప్రసాద్ , పేర్ని లెనిన్ , సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అనంతరం ఎలక్షన్ ఆఫీసర్ జిల్లా కోపరేట్ సూపర్నెంట్ వేణుగోపాల్ గారు, ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండా వెంకటయ్య , మల్ల యాకయ్య , మాయ రాములు , పేర్ని నరసింహులు, గుండ కుమార్, కొలుపుల నాగరాజు, పేర్ని అనిల్ , పేర్ని వీరస్వామి , దేవర కుమారస్వామి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రెండు అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలకు రెండు బీరువాలు ఆట వస్తువులు

**ఆయన సొంత నిధులతో ఆర్థిక సాయం**

**బీఆర్ఎస్ విలేజ్ అధ్యక్షులు రామ్ చందర్ ముదిరాజ్**



మొయినాబాద్ సెప్టెంబర్ 24:(డైలీ రిపోర్ట్) మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలకు ఆయన సొంత నిధులతో రెండు బీరువాలు ఆడుకోడానికి ఆట వస్తువులు పుస్తకాలు పెట్టుకోవడానికి రెండు బీరువాలు అందించారు చిలుకూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ విలేజ్ అధ్యక్షులు సదువు రామ్ చందర్ ముదిరాజ్ రెండు అంగన్వాడీ కేంద్రాల పిల్లలు ఆడుకోడానికి ఆట వస్తువులుతో పాటు పుస్తకాలు పెట్టుకోవడానికి రెండు బీరువాలు ఆయన సొంత నిధులతో అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు అవసరాలను గుర్తించి అంగన్వాడి కేంద్రాలలో సరిపడా వస్తువులు అందించినందుకు సూపర్వైజర్ శ్రీలక్ష్మి, దర్శన్, గ్రామస్తులు రామ్ చందర్ ముదిరాజ్ ను అభినందించారు

## నవజాత శిశువు విక్రేత అరెస్ట్

హైదరాబాద్: నవజాత శిశువును విక్రయించేందుకు ప్రయత్నించిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన చంద్రాయణగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే.. షేక్ ఇస్మాయిల్, సుల్తానా బేగంలకు ఇటీవల ఓ బాబు జన్మించాడు. ఈ శిశువు వీరికి నాలుగో సంతానం. దీంతో 15 రోజుల చిన్నారిని అమ్మాలని వారు నిర్ణయించుకున్నారు. అందుకోసం మెహది అనే వ్యక్తిని సంప్రదించారు. ఫాతిమా రహ్మత్ అనే మరో వ్యక్తికి ఫోన్ చేసిన మెహది... బాబును విక్రయించాలని కోరాడు. దీంతో వారంతా కలిసి చిన్నారి విక్రయానికి ప్రణాళిక వేశారు. వీళ్లంతా చంద్రాయణగుట్టలో కలుసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

## అమృతం టెండర్లపై కెటిఆర్ అడ్డగోలు విమర్శలు

**మండిపడ్డ ఎంపి మల్లు రవి**

హైదరాబాద్: అమృత్ పథకం టెండర్ల విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ధ్వజమెత్తారు. సృజన్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి సతీమణికి సొంత తమ్ముడు కాదని, బాబాయ్ కొడుకు అవుతాడని, ఈ విషయంలో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆన్‌లైన్‌లో టెండర్లు వేసిన అమృత్ పథకంలో ఆయన.. తన కంపెనీకి జాయింట్ వెంచర్‌లో కాంట్రాక్టు పొందారని, అక్కడ అక్రమాలకు తావులేదని మల్లు రవి తెలిపారు. భాజపా ప్రభుత్వం ఉన్న కేంద్రంలో టెండర్లలో సీఎంకు ఎలాంటి సంబంధం లేదనే విషయం ఆలోచించకుండా కేటీఆర్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. భారాస పదేళ్లలో చేయలేని పనులు సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల కాలంలో చేస్తుంటే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భారాస ప్రతిపక్షంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోతుందని హితవు పలికారు.

## పార్టీ ఫిరాయింపులు రాజ్యాంగ విరుద్ధం

**హైకోర్టులో కెఎ పాల్ పిటిషన్..ఎమ్మెల్యేలకు నోటీసులు**

హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఏలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ 'ప్రజాశాంతి పార్టీ' అధ్యక్షుడు కెఏ.పాల్ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన హైకోర్టు, పది మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఏలకు నోటీసులు జారీ చేసింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారడం రాజ్యాంగ విరుద్ధం అని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కెఏ.పాల్ తన పిటిషన్ లో కోరారు. ఖైరతాబాద్ ఎంఎల్‌ఏ దానం నాగేందర్ బిఆర్ఎస్ టికెట్ పై గెలుపొంది, ఆరునెలలు గడవక ముందే మరో పార్టీలోకి జంప్ చేశారని ఆయన తన పిటిషన్ లో పేర్కొన్నారు.



## బాసర త్రిబుల్ ఐటీ లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం

**నిర్మల్ సెప్టెంబర్ 24( డైలీ రిపోర్ట్) :** నిర్మల్ జిల్లా బాసర త్రిబుల్ ఐటీ లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు అవసరమని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిసి వెంకటరమణ అధికారులు రణధీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డులను తీసుకురావాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హనుమకొండ అర్బన్ సెప్టెంబర్ 24(డైలీ రిపోర్ట్) :** హనుమకొండ జిల్లాకు వివిధ క్రీడాంశాలలో రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు అవార్డులను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.హనుమకొండ లోని జేఎన్ఎస్ లో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజనోత్సవాలను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు వివిధ క్రీడల్లోనూ రాణించాలన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన విధంగానే రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభను చాటాలన్నారు. విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారని పేర్కొన్నారు. సైన్స్ మేళాను కలెక్టర్ సందర్శించి సైన్స్ సంబంధిత హనుమకొండ ప్రయోగ ప్రదర్శనల గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి గురించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైన్స్ మేళాలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు చాలా అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందించారని అన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ మేళాలో కూడా ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలు విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. అజీజ్ ఖాన్ మాట్లాడుతూ స్వామి వివేకనంద యువతకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత పరశురాములు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి కోసం చర్యలు తీసుకుంటాం

**దేవరకద్ర లో రైల్వే గేట్ ను పరిశీలించిన ఎంపీడీకే అరుణ**



**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 24(డైలీ రిపోర్ట్) :** జిల్లాలోని దేవరకద్ర లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ స్థానిక బీజేపీ నేతలు,వ్యాపారులతో కలిసి దేవరకద్రలోని రైల్వే గేట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, ఇతర పనుల కోసం కూలీలు, సామాన్య ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, గత కొన్నేళ్లుగా స్థానిక ప్రజలు రైల్వే గేటు దాటేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికుల ఇబ్బందులను రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురికి సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707